క్లుప్తంగా

మైలవరం జూనియర్ సివిల్ కోర్టు జడ్జిగా శైలజ



మైలవరం: మైలవరం జూనియర్ సివిల్ కోర్టు జడ్జిగా శైలజ నియమితులయ్యారు. అమరావతి హైకోర్టు జ్యుడీషియల్ విభాగంలో సాధారణ బదిలీలు జరిగాయి. ఇప్పటి వరకు మైలవరం జూనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్న షేక్ షిరీన్ తూర్పు గోదావరి జిల్లా కాకినాడ 5వ జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు. కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ జూనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు నిర్వహించిన మద్దిబోయిన శైలజ బదిలీపై మైలవరం రానున్నారు. జడ్జి షేక్ షిరీన్ ఈ నెల 26న మైలవరంలో రిలీవ్ కానుండగా అదే రోజు జడ్జి శైలజ బాధ్యతలు స్వీకరించనున్నట్లు కార్యాలయం తెలిపింది.

ఆలయాల్లో చందనోత్సవం



తిరువూరు: వైశాఖ మాస ప్రారంభ సందర్భంగా తిరువూరులోని పలు ఆలయాల్లో ఆదివారం చందనోత్సవం నిర్వహించారు. శ్రీవేంకటాచలస్వామి దేవస్థానంలో జరిగిన చందనోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాలాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ అనుమోలు ముత్తారావు పర్యవేక్షించారు. శ్రీరాజ్యలక్ష్మీ సమేత రంగనాయక స్వామి దేవస్థానంలో స్వామికి జరిపిన చందనోత్సవంలో ఆలయ చైర్మన్ దారా రంగారావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

నూజివీడు: బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్‌లో చేరేందుకు ఉద్దేశించిన ప్రవేశ పరీక్షను ఆదివారం స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించారు. ఐదో తరగతికి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించారు. ఇంటర్‌కు మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహించారు. ఐదో తరగతి ఎంట్రన్స్ పరీక్షకు 400 మంది నమోదు చేసుకోగా 364 మంది హాజరవ్వగా, 36 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఇంటర్ ప్రవేశ పరీక్షకు 327 మంది రిజిస్టర్ చేసుకోగా అందులో 20 మంది గైర్హాజరయ్యారు. 307 మంది పరీక్షను రాశారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ప్రిన్సిపాల్ ఆర్.లక్ష్మి ఏర్పాట్లు చేశారు.

ఆస్తి పన్నుపై రాయితీకి వారం రోజులే గడువు

నూజివీడు: 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పురపాలక సంఘం పరిధిలోని ఆస్తి, ఖాళీ స్థలాల పన్నును ఐదు శాతం రాయితీతో చెల్లించేందుకు వారం రోజుల గడువు మాత్రమే ఉందని మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్ ఆదివారం చెప్పారు. ఏప్రిల్ 30వ తేదీ లోపు పన్ను చెల్లించే వారికి ఈ రాయితీని కల్పిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మొత్తం పన్నును ఒకేసారి ఏకమొత్తంగా చెల్లించే వారికి మాత్రమే ఐదు శాతం రాయితీ వర్తిస్తుందని కమిషనర్ స్పష్టం చేశారు. ఇప్పటికే చాలామంది పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారన్నారు. ప్రజల సౌకర్యార్థం సెలవు రోజుల్లో కూడా పన్నులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. పన్ను చెల్లింపు దారులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ అబ్దుల్ రషీద్ విజ్ఞప్తి చేశారు.

నేడు 'స్పందన'

నూజివీడు: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

తిరువూరులో..

తిరువూరు: స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్డీఓ ప్రసన్నలక్ష్మి తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

జగ్జీవన్‌రామ్ విగ్రహానికి మరమ్మతులు

ఇబ్రహీంపట్నం: మాజీ ఉపప్రధాని జగ్జీవన్ రామ్ విగ్రహం చేతికర్ర గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన నేపథ్యంలో సీఐ పి.శ్రీను కేసు నమోదు చేసి నిందితులను తప్పని సరిగా పట్టుకుంటామని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ నాయకులు విగ్రహం చేతికర్ర ఏర్పాటు చేశారు. జగ్జీవన్‌రామ్, పక్కనే ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు చేతికర్ర ఏర్పాటు చేయడం జీర్ణించుకోలేని టీడీపీ కార్యకర్తలు అక్కడకు చేరుకుని నిందితులను పట్టుకున్న తర్వాత చేతికర్ర ఏర్పాటు చేయాలని కొద్దిసేపు హడావుడి చేసే ప్రయత్నించారు.

భూసారం.. తెలిస్తే ఎంతో లాభం

విస్తృతంగా భూసార పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు



తుక్కులూరులో భూసార పరీక్షల నిమిత్తం మట్టి నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయ, ఉద్యాన సహాయకులు

నూజివీడు: పంటల సాగులో అధిక దిగుబడులు రావాలంటే భూసారం కీలకం. భూసారం తెలియాలంటే రైతులు తమ వ్యవసాయ క్షేత్రంలో మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేయించుకోవాలి. భూసార పరీక్షలు చేయించడం ద్వారా నేలలో నత్రజని, భాస్వరం, ఫాస్పరస్ ఎంత మోతాదులో ఉందో తెలుస్తుంది. భూమిలో పోషకాలు, ఆమ్ల, క్షార స్థితి, చౌడు, ఇతర లోపాలు తెలుస్తాయి. తద్వారా వ్యవసాయ అధికారులు సిఫార్సు చేసిన ఎరువులు వాడటం ద్వారా ఎరువుల వృథా వాడకం తగ్గడమే కాకుండా ఎరువులపై పెట్టుబడి కూడా తగ్గుతుంది. భూమి సేద్యానికి అనువుగా లేకపోతే ఏ ఎరువులు ఎంత మోతాదులో వాడాలో తెలుసుకుని వాటిని వేయడం ద్వారా పంటల దిగుబడి పెరుగుతుంది. నూజివీడు నియోజకవర్గంలో నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాలు ఉండగా ఈ మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో వరి, మొక్కజొన్న, దాళ్వా సీజన్‌లో మొక్కజొన్న, మిర్చి తదితర పంటలను రైతులు సాగు చేస్తారు. నాలుగు మండలాల్లో కలిపి దాదాపు 70 వేల ఎకరాల్లో రైతులు సేద్యం చేస్తారు. వేసవి తరువాత వచ్చే ఖరీఫ్ నాటికి మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలను నిర్వహించి వాటి ఫలితాలను రైతులకు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు శిక్షణ పూర్తి

మట్టి నమూనాలు సేకరణ, భూసార పరీక్షలపై ఇప్పటికే నియోజకవర్గంలోని సచివాలయ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు వ్యవసాయశాఖ అధికారులు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ శిక్షణలో మట్టినమూనాలను సేకరించే విధానంపై క్షుణ్ణంగా వివరించారు. వ్యవసాయ భూముల్లో ఆరు అంగుళాలు లేదా 15సె.మీ. లోతు వీ ఆకారం గొయ్యిని తీస్తారు. పండ్ల తోటల్లో అయితే ఐదు అడుగుల గొయ్యి తవ్వి అడుగుకొకటి చొప్పున ఐదు నమూనాలు సేకరిస్తారు. సేకరించిన మట్టి నమూనాలను భూసార పరీక్ష ల్యాబ్‌కు పంపుతారు. ఫలితాలు వచ్చిన తరువాత ఏయే పోషకాలు వాడాలో వ్యవసాయాధికారులకు రైతులకు వివరిస్తారు.

ఆరు రకాల పరీక్షలు

సేకరించిన మట్టి నమూనాలను భూసార పరీక్ష ల్యాబ్‌కు పంపిన తరువాత అక్కడ ఆరు రకాల పరీక్షలు చేస్తారు. నత్రజని, భాస్వరం, పోటాష్ లభ్యతతో పాటు నేల స్వభావం, లవణాల లభ్యత, ఆమ్ల, క్షార లక్షణాలకు సంబంధించిన పరీక్షలు చేస్తారు. వాటిని ఆధారంగానే రైతులకు సూచనలు చేస్తారు.

విస్తృతంగా మట్టి నమూనాల సేకరణ



వేసవిలో మట్టి నమూనాలను విస్తృతంగా సేకరించేలా చర్యలు తీసుకున్నాం. భూసార పరీక్షల ఫలితాలను బట్టి ఎరువులను, పోషకాలను వాడతాం. దీని వల్ల వృథా వాడకం తగ్గిపోయి పెట్టుబడి కూడా తగ్గుతుంది. తద్వారా తక్కువ పెట్టుబడితో పంటల దిగుబడి సైతం పెరుగుతుంది.

– ఆలూరు చాముండేశ్వరి, వ్యవసాయాధికారి, నూజివీడు

వర్షితప్ దీక్షల ముగింపు ఉత్సవం

- భారీగా తరలివచ్చిన జైనులు
- పాతబస్తీ జైన ఆలయాల్లో ప్రత్యేక పూజలు





దీక్షలను విరమింపజేస్తున్న కుటుంబ సభ్యులు ; మాట్లాడుతున్న జైన గురువు శ్రీ అభినందన్ చంద్రసాగర్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జైనులు పవిత్రంగా భావించే వర్షితప్ దీక్షల ముగింపు ఉత్సవం ఆదివారం ముగిసింది. ఏడాది కాలంగా జైన ఆచారం ప్రకారం వర్షితప్ పేరుతో కొనసాగిస్తున్న ఉపవాస దీక్షలను వారి ప్రత్యేక కార్యక్రమాల నడుమ విరమించారు. పాతబస్తీలోని శ్రీ సంభవనాథ్ జైన్ శ్వేతాంబర్ మూర్తిపూజక్ సంఘ్ ఆధ్వర్యాన రెండు రోజుల ఉత్సవంలో భాగంగా స్థానిక ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్‌లో సామూహికంగా ఉపవాస దీక్షల విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దీక్షలను ఆచరించిన వారికి ప్రత్యేక సింహాసనం వంటి ఆసనాలు ఏర్పాటు చేసి వారికి చెరుకు రసాన్ని అందించారు. కార్యక్రమంలో వారి బంధువులు భారీగా తరలిరావటంతో లోపలకు వెళ్లేందుకు ప్రత్యేక పాస్‌లను జారీ చేసి వారిని మాత్రమే అనుమతించారు. సంఘ్ అధికార ప్రతినిధి ప్రవీణ్ రాంకా మాట్లాడుతూ జైన సంప్రదాయంలో పలు సందర్భాల్లో ఉపవాసదీక్షలను ఆచరిస్తారన్నారు. ఆ క్రమంలో వర్షితప్ చాలా గొప్ప దీక్షగా తమ పెద్దలు చెబుతారన్నారు. రెండో రోజు ఉత్సవానికి పదిహేను వేల మంది జైనులు హాజరైనట్లు వివరించారు.

సమాజానికి జైన ధర్మం అవసరం

ప్రస్తుత సమాజానికి జైన ధర్మం చాలా అవసరమని ప్రముఖ జైనగురువు పరమపూజ్య అభినందన్ చంద్రసాగర్ అన్నారు. ఆదివారం సాయంత్రం జరిగిన ప్రవచన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో శాంతి వర్ధిల్లాలంటే జైన మత ధర్మాన్ని అనుసరించడం చాలా అవసరమన్నారు. జైనంలో ఉపవాసానికి చాలా ప్రాముఖ్యత ఉందన్నారు. విజయవాడ వంటి నగరంలో వందలాది మంది దీక్షను ఆచరించటం ఆనందాన్ని కలిగించిందన్నారు. నిర్వాహకులను అభినందించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

పాతబస్తీలోని పలు జైన ఆలయాల్లో అక్షయతృతీయ పర్వదినాన్ని పురస్కరించుకొని విశేష వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. వట్టూరి వారి వీధిలోని జైన మందిరంలో జైన ప్రథమ తీర్థంకరుడు ఆదినాథ్‌ప్రభుజీ విగ్రహానికి చెరుకురసంతో ప్రత్యేక అభిషేకాలు చేశారు. కార్యక్రమాలను సంస్థ అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్ బోరోతరియా, ప్రధాన కార్యదర్శి పన్నాలాల్ జైన్ ఉపాధ్యక్షులు అశోక్ జైన్, జయంతిలాల్ జైన్, సహాయక కార్యదర్శి భోగిలాల్ జైన్, కోశాధికారి డుంగరమల్ జైన్, సహ కోశాధికారి రాహుల్ జైన్ తదితరులు పర్యవేక్షించారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి



ఠాగూర్ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనలో విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది



పుస్తకాలను ఎంపిక చేసుకుంటున్న సందర్శకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ అన్నారు. ఆదివారం ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో పుస్తక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. జమల పూర్ణమ్మ మాట్లాడుతూ పుస్తకం ప్రియనేస్తమని పేర్కొన్నారు. పుస్తకాలు దారి చూపే దివ్వెలని, అటువంటి పుస్తకాలను పఠనం చేసి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. పుస్తకం విలువ తెలియజెప్పడం, పుస్తకాల పట్ల అభిలాషను పెంచేందుకు 1995 నుంచి ఏటా 'ప్రపంచ పుస్తక దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి కె.రమాదేవి, వై.ధనలక్ష్మి, కె.రాంబాబు, గోపాలరావు, దుర్గాంబ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పుస్తక పంపిణీకి స్పందన

పటమట(విజయవాడతూర్పు): ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలని ఏపీ గ్రంథాలయ సంఘ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావి శారద తెలిపారు. గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో, విజయవాడ సర్వోత్తమ భవనంలో ఉచిత పుస్తక పంపిణీ జరుగుతోంది. కార్యక్రమంలో రెండో రోజు ఆదివారం అనూహ్య స్పందన వచ్చిందని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, వృద్ధులు, మహిళలు, బాల బాలికలు తమకు నచ్చిన పుస్తకాలను తీసుకెళ్లారన్నారు. నగర పౌరులేకాక, సమీపంలోని గన్నవరం, మంగళగిరి, గుడివాడ, పామర్రు, తెనాలి తదితర ప్రాంతాల నుంచి వచ్చి పుస్తకాలు తీసుకెళ్లారని, పుస్తక పంపిణీకి పెరుగుతున్న ఆదరణ నేపథ్యంలో వచ్చే ఏడాది నుంచి మూడు రోజులపాటు నిర్వహిస్తామని ప్రకటించారు. పుస్తకాల పంపిణీకి పలువురు జిల్లా స్థాయి అధికారులు, న్యాయ, పోలీసు, పోస్టల్ తదితరశాఖల ఉన్నతోద్యోగులు కుటుంబ సభ్యులతో వచ్చి పుస్తకాలను తీసుకెళ్లారని పేర్కొన్నారు. ఆదివారం 13 వేల మందికి పైగా విచ్చేసి 38 వేలకు పుస్తకాలు తీసుకెళ్లారని, వీటిలో కూడా ఎక్కువ భాగం మెడికల్, ఇంజినీరింగ్, విద్యార్థులు స్టడీ మెటీరియల్స్, పోటీ పరీక్షల పుస్తకాలు, బాల సాహిత్యం, మతాలూ, సాహిత్య గ్రంథాలు ఎక్కువగా ఉన్నాయన్నారు.

కొనసాగుతున్న 'జగనన్నే మా భవిష్యత్తు'



కాట్రేనిపాడులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

ముసునూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో జెడ్పీటీసీ సభ్యుడు, సచివాలయాల కన్వీనర్ వరికూటి ప్రతాప్ ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, గ్రామ పెద్దలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం కొనసాగించారు. కాట్రేనిపాడులో గ్రామ పార్టీ అధ్యక్షుడు కంబాల రాంబాబు ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ప్రతి ఇంటికీ వెళ్లి మా నమ్మకం నువ్వే జగనన్న కరపత్రాలను పంపిణీ చేశారు. జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్లను తలుపులపై, మొబైల్ ఫోన్లపై అంటిస్తూ, అంగీకారం ఉన్న వారితో మిస్డ్ కాల్స్ చేయిస్తూ కార్యక్రమాలను కొనసాగించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ ఆర్.కృష్ణకుమారి సుబ్బారావు, వైస్ ఎంపీపీ గంగాధర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు పాల్గొన్నారు.

తొమ్మిది మంది జూదరుల అరెస్టు

ఆగిరిపల్లి: మండలంలో రెండు గ్రామాల్లో జూదమాడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఎస్.చంటిబాబు ఆదివారం తెలిపారు. ఆగిరిపల్లిలో పేకాడుతున్న నలుగురిని, నెక్కలం గొల్లగూడెంలో నంబర్లాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.4,150 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అలరించిన నాట్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఖమ్మానికి చెందిన అభినయ రుద్ర నాట్యాలయానికి చెందిన కళాకారులు ప్రదర్శించిన భరతనాట్యం భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. ధర్మపథం కార్యక్రమంలో ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని కళావేదికపై పలువురు కళాకారులు భరత నాట్య ప్రదర్శన ఇచ్చారు.

సుమారు 20 మంది నృత్య ప్రదర్శన చేశారు. కళా ప్రదర్శన అనంతరం అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.

అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ లభ్యం



అదృశ్యమైన వ్యక్తిని పట్టుకుని కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ

ఆగిరిపల్లి: అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ లభ్యమైనట్లు ఎస్ఐ ఎస్.చంటిబాబు ఆదివారం తెలిపారు. మండలంలోని వట్టిగుడిపాడుకు చెందిన సింహాద్రి నాగమల్లేశ్వరరావు ఈ నెల 10వ తేదీన ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్ల వద్ద, చుట్టుపక్కల వెదికినా ఆచూకీ దొరక్కపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. అప్పులు చేయడం వల్ల మనస్తాపంతో ఇంట్లోంచి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్ఐ చంటిబాబు తన సిబ్బందితో రెండు బృందాలుగా ఏర్పడి బంధువుల సహాయంతో వట్టిగుడిపాడు శివారు తోటల్లో ముమ్మరంగా గాలించారు. అక్కడ నాగమల్లేశ్వరరావును గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వెళ్లి విచారించారు. అప్పుల బాధ ఎక్కువై ఇంట్లోంచి వెళ్లిపోయానని తెలిపాడు. అనంతరం అతడికి కౌన్సెలింగ్ ఇచ్చి భార్య, కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నేటి నుంచి అమ్మ జాన్ ఉరుసు మహోత్సవం



విలేకరులతో మాట్లాడుతున్న ఖాజా మొహిద్దీన్

ఏ.కొండూరు: మండలంలోని చీమలపాడు ఏఏఎంటీకే దర్బార్‌లో ఈ నెల 24, 25, 26 తేదీల్లో నఖిబుల్ ఔలియా సూఫీ మహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరి ఔలియా బాబా ధర్మపత్ని సర్వోన్నత సూఫీ మహనీయ జనని మొహమ్మద్ ఖమ్రున్నిసా బేగమ్ పావన ద్వితీయ సూఫీ సుగంధ ఉరుసు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు దర్బార్ పీఠాధిపతి పీర్జాద మొహమ్మద్ ఖాజామొహీద్దీన్ షా తాజ్ ఖాదరి తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఈ దర్బార్‌లో ఆరున్నర దశాబ్దాల సుదీర్ఘకాలం నుంచి అత్యంత రుచికరమైన అన్నామృత ప్రసాదం తన స్వహస్తాలతో వండి వడ్డించిన ఆమె జీవితం సేవా నిరుతికి ఒక సజీవ నిర్వచనం అన్నారు. చీమలపాడు బాబా వారు అన్నామృత ప్రసాద వితరణ తన జీవిత లక్ష్యంగా భావించి బాబా తలపెట్టిన మహా సంకల్పం మహా యజ్ఞం కోసం తన జీవితంలోని ప్రతి క్షణాన్ని ధార పోసిన అమ్మ ఉరుసును ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. 24వ తేదీన ఉరుసు ప్రారంభం, దివ్య ఖురాన్ పారాయణం, మహాదివ్య అన్న సమారాధన, 25న అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరి ఔలియా వారి దర్గాలో పవిత్ర చాదర్ సమర్పణ పుష్పాంజలి, 26వ తేదీన పీఠాధిపతి పీర్ జాదా మొహమ్మద్ ఖాజా మొహీయుద్దీన్ షా తాజ్‌ఖాదరి వారి ఆధ్యాత్మిక సందేశం, ఉరుసు ముగింపు ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఉరుసు మహోత్సవానికి కుల మతాలకు అతీతంగా భక్తులందరూ విచ్చేసి ప్రసాదాన్ని స్వీకరించాలన్నారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. కార్యక్రమంలో జాఫర్ షరీఫ్, ఖాదర్‌బాబు, బాగ్దాద్ పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి



బీరువాను ప్రారంభించిన వైఎస్సార్ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు గంగాధరరావు

చంద్రాల(మైలవరం): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని వైఎస్సార్ రైతు విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావు తెలిపారు. మైలవరం మండలం చంద్రాల గ్రామంలోని ఎంపీపీ పాఠశాల (మెయిన్), బీసీ పాఠశాలకు దాతలు ప్రవాసాంధ్రులు డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి, విజయలక్ష్మీ వితరణతో కుంటముక్కల శివరామకృష్ణ ఆదివారం రెండు బీరువాలు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి. గోపాల్ ద్వారా అందజేశారు. గ్రామ సర్పంచ్ జే జ్యోతి, గంగాధరరావు బీరువాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గంగాధరరావు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని, తాము చదివిన పాఠశాలకు, ఇంకా ఎన్నో మంచి కార్యక్రమాలు, పాఠశాలల అభివృద్ధికి సహాయపడాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.గోపాల్, శ్రీనివాసరావు, రాజశేఖర్ పాల్గొన్నారు.

ద్రవ పదార్థాలు అధికంగా తీసుకోవాలి



పరీక్షలు చేస్తున్న డాక్టర్లు ఎస్‌వీకే ప్రసాద్, కోనా వీరబ్రహ్మం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎండలు పెరుగుతుండటంతో ప్రతి ఒక్కరూ ద్రవ పదార్థాలను అధికంగా తీసుకోవాలని ఆయుర్వేద వైద్యనిపుణులు ఎస్‌వీకే ప్రసాద్, హోమియోపతి వైద్యులు కోనా వీరబ్రహ్మం సూచించారు. దుర్గాపురం విజయ్‌నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆరోగ్య అవగాహన, ఉచిత వైద్య శిబిరం జరిగింది.వారు మాట్లాడుతూ ఎండల్లో సాధ్యమైనంత వరకు తిరగకూడదని ఒక వేళ అత్యవసరమైతే చెవి, ముక్కు నోటికి రక్షణగా కప్పుకుని బయటకు వెళ్లాలన్నారు. పల్చటి లేతరంగు కాటన్ వస్త్రాలను ధరించాలని సూచించారు. సీజనల్ పండ్లు అధికంగా తీసుకోవటంతో పాటు తాటి ముంజలు, బీర, దోస, సొరకాయ వంటి కూరగాయలను తీసుకోవాలన్నారు. అనంతరం ఉచితంగా వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సుమారు 250 మందికి వైద్యపరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రభొట్ల ఆదిత్య, ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరి కుమార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నరసింహస్వామి మహా యజ్ఞం



యజ్ఞం చేస్తున్న దయానిధి దాసన్ గురూజీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): అక్షయ తృతీయ సందర్భంగా లోక కల్యాణార్థం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని శ్రీజగన్నాథ మందిరంలో ఆదివారం నరసింహస్వామి మహాయజ్ఞం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు శ్రీమాన్ దయానిధి దాసన్ గురూజీ యజ్ఞంలో పాల్గొన్నారు. యజ్ఞయాగాదులతో రాష్ట్రం పాడి పంటలతో సుభిక్షంగా ఉంటుందని దాసన్ గురూజీ తెలిపారు. నేటి యువత ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం ముదావహమన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన వివరాలు

తిరువూరు: స్థానిక ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి సోమవారం పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని నియోజకవర్గ కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. విస్సన్నపేటలోని 3వ సచివాలయ నూతన భవనాన్ని సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభిస్తారని, అనంతరం మామిడి ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. 25న తిరువూరు నగర పంచాయతీలోని 17వ వార్డులో, 26న తిరువూరు 19వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు.

అభివృద్ధి పనులపై నేడు బహిరంగ చర్చ

అనుమతి లేదంటున్న పోలీసులు

తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలో గత నాలుగు సంవత్సరాల్లో జరిగిన అభివృద్ధి పనులపై సోమవారం ఉదయం బహిరంగ చర్చకు తెలుగుదేశం, వైఎస్సార్ సీపీ నాయకులు బహిరంగ చర్చకు సిద్ధమైన తరుణంలో పోలీసులు ఇందుకు అనుమతి నిరాకరించారు. వారం రోజులుగా ఇరు పార్టీల నడుమ నియోజకవర్గ అభివృద్ధిపై జరుగుతున్న సవాళ్లు, ప్రతిసవాళ్లు కొనసాగుతున్నాయి. తిరువూరులో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ కంచి రామారావు సంస్మరణ సభకు వచ్చిన విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నానీ) తిరువూరు నియోజకవర్గ అభివృద్ధిపై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఈ వివాదం ఏర్పడింది. శాంతిభద్రతల దృష్ట్యా ఇరు పార్టీల నేతలను పోలీసులు ఆదివారం గృహనిర్బంధంలో ఉంచారు. అవసరమైతే ముందస్తు అరెస్టులు చేస్తామని తెలిపారు.

యువకుడిపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బాలిక వెంట పడి వేధిస్తున్న యువకుడిపై కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వించిపేట షాహీమసీదు ప్రాంతంలోని దంపతులు నివసిస్తున్నారు. వీరికి ఇద్దరు సంతానం. కుమార్తె(14) మొహమ్మద్ ఆలీ పురం స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతోంది. బాలిక వెంట జాఫర్ ఆలీ అనే యువకుడు వెంట పడి వేధిస్తుండటంతో పెద్దలకు చెప్పారు. శనివారం రాత్రి 11 గంటల సమయంలో జాఫర్ ఆలీ బాలిక ఇంటి తలుపులు తీయడంతో తల్లిదండ్రులు, చుట్టుపక్కల వారు కేకలు వేశారు. దీనిపై బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: మీనాక్షి కల్చరల్ అకాడమీ, తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి చారిటబుల్ సంస్థ ఆధ్వర్యంలో సినీ నటుడు ఎన్టీఆర్ శతజయంతి వేడుకల సందర్భంగా గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదికపై నిర్వహించిన శతజయంతి వేడుకలు, సినీ సంగీత విభావరి అలరించింది. బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణ మూర్తి మాట్లాడుతూ తెలుగు వారి ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్టీఆర్‌గా అభివర్ణించారు. తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి చారిటబుల్ సంస్థ చైర్మన్ శ్రీనివాసరెడ్డి ఎన్టీఆర్ సినీ జీవిత విశేషాలను వివరించారు.